క్లుప్తంగా

నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు



ముస్తాబైన చిట్లపల్లి దర్గా

కొడంగల్ రూరల్: అత్యంత మహిమ గల అబ్దుల్లా సాహెబ్(అబ్దుల్లాషా సాహి) దర్గా ఉర్సు ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నేటి నుంచి 5రోజుల పాటు సాగే ఉత్సవాల్లో.. మొదటి రోజైన బుధవారం గంధం ఉత్సవాలు, గురువారం దీపారాధన, కవ్వాలి తదితర కార్యక్రమాలు జరగనున్నాయి. భక్తుల కొంగుబంగారంగా పేరుగాంచిన అంగడి రాయిచూర్-చిట్లపల్లి గ్రామాల మధ్య వెలసిన చిట్లపల్లి దర్గా వేడుకలకు పరిసరప్రాంతాల నుంచే కాకుండా.. హైదరాబాద్, ముంబయి, గుల్బర్గా నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకోనున్నారు. వేడుకల సందర్భంగా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు.

ఆలయ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం

మర్పల్లి: సిరిపురం హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి ఎస్కేఆర్ ట్రస్ట్ చైర్మన్ కొండల్‌రెడ్డి రూ.3 లక్షల విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ఉప సర్పంచ్ రమేష్, మాజీ సర్పంచ్ శంకరయ్యగౌడ్, మర్పల్లి సహకార సంఘం డైరెక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పునర్నిర్మాణంలో భాగంగా గర్భగుడిలో గ్రానైట్ వేసేందుకు పనులు ప్రారంభించినట్లు సభ్యులు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం సభ్యులు జనార్దన్‌రెడ్డి, రఘురాంరెడ్డి, అనంతి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేవంత్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఢిల్లీలో రేవంత్‌ను కలిసిన పరిగి నాయకులు

పరిగి: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ పరిగి నియోజకవర్గ నాయకులు మంగళవారం ఢిల్లీలోని ఆయన అధికార నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో ఇక్కడి రాజకీయ పరిస్థితులపై రేవంత్ ఆరాతీసినట్లు సమాచారం. ఈ ఆరునెలలు కష్టపడి పనిచేస్తే పరిగిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని, అందుకు మీరందరూ నిత్యం ప్రజల మధ్యే ఉంటూ.. వారి సమస్యలపై పోరాటం చేయాలని చెప్పినట్లు తెలిసింది. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, డీసీసీ ఉపాధ్యక్షుడు హన్మంతు ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, సీనియర్ నాయకులు చిన్న నర్సింహులు, రాజాపుల్లారెడ్డి, శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

తాండూరు టౌన్: ప్రజా సమస్యలపై బీజేపీ అలుపెరుగని పోరాటం చేస్తుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్నేళ్లుగా తాండూరు మున్సిపాలిటీకి పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో వార్డుల్లో సమస్యలు పెరిగిపోయాయని, రెండేళ్లుగా మున్సిపల్ బడ్జెట్ ప్రవేశ పెట్టక పోవడంతో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయని ఆరోపించారు. ఇందుకు కారణం ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డిల మధ్య కొనసాగుతున్న ఆధిపత్య పోరే అని విమర్శించారు. బీజేపీ పోరాటం వల్లే నేడు తాండూరు మున్సిపాలిటీకి కొత్త కమిషనర్ వచ్చారని, బడ్జెట్ సమావేశాలు నిర్వాహించారని చెప్పారు.

భవానీ మాతకు ప్రత్యేక పూజలు

బషీరాబాద్: దామర్‌చెడ్ భవానీ మాత జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. 4వ రోజు అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మాడపతి సిద్దిలింగయ్య దేవీ భాగవతం వినిపించారు. అలాగే గీతా పారాయణం, భగవద్గీత పారాయణం చేశారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

బొంరాస్‌పేట: నాగిరెడ్డిపల్లి శివారు శ్రీపార్వతీ పరమేశ్వర స్వామి ఆలయ 24వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈనెల 2 నుంచి 4వరకు మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మూడో రోజు ఉదయం అభిషేకం చేశారు. మధ్యాహ్నం వీడ్కోలు సభ నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగించారు. ఆలయ పూజారి శాంతకుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

6న ప్రత్యేక పూజలు

కొడంగల్: పట్టణ శివారులోని శేషు ఆంజనేయ స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు కానుకుర్తి హన్మంత్ రెడ్డి, కుర్వ వెంకట్ తెలిపారు. పౌర్ణమి సందర్భంగా అభిషేకం, ఆకుపూజ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ఉపాధి కూలీలకు ఊరట

- రోజువారి వేతనం రూ.15 పెంచిన కేంద్రం
- ఏప్రిల్ 1నుంచి అమలు
- హర్షం వ్యక్తంచేస్తున్న కూలీలు



ఉపాధి పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు (ఫైల్)

దౌల్తాబాద్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో రోజువారి వేతనాన్ని పెంచుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పెరిగిన కూలి రేట్లు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలులోకి వచ్చాయి. మండలంలో 33 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ జీపీల పరిధిలో 28,649 జాబ్‌కార్డులు ఉండగా.. 15,955 మంది కూలీలు ఉన్నారు. ఉపాధి కూలి పెంచడంతో మండలంలో ప్రస్తుతం పనిచేస్తున్న 1,800 మందికి ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం మండలంలో ఉపాధిహామీ పనులు ఊపందుకున్నాయి. వేసవి కావడంతో వ్యవసాయ పనులు తగ్గి, రోజు వారి ఉపాధి పనికి హాజరయ్యే వారి సంఖ్య పెరుగుతోంది. మండలంలో ఏటా క్రమం తప్పకుండా మూడు వేల మందికి పైగా కూలీలు పనులకు వెళ్తుంటారు. ప్రస్తుతం రోజుకు 1500 నుంచి 1800 వరకు మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారు.

రూ.257 నుంచి 272కు..

'ఉపాధి'లో భాగంగా ప్రస్తుతం ఫీడర్ చానల్, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ, చేపల చెరువులు, చెరువుల్లో పూడికతీత, ఊటకుంటల పూడికతీత, పంట పొలాలకు వెళ్లేందుకు మట్టిరోడ్ల నిర్మాణం, కందకాల తవ్వకం తదితర పనులు చేపడుతున్నారు. ఉపాధిహామీ పనులకు హాజరయ్యే కూలీ.. నిర్ణీత సమయంలో పని చేసేవారికి రోజుకు రూ.257 వేతనంగా మార్చి 31వరకు చెల్లించగా.. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం ఏప్రిల్ 1 నుంచి రూ.15 పెంచుతూ రూ.272 చెల్లించేందుకు నిర్ణయించారు.

> **సద్వినియోగం చేసుకోవాలి**
>
> గ్రామాల్లో కూలీలు అందరూ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. 'ఉపాధి'లో వేతనాన్ని రూ.257 నుంచి రూ.272కు పెంచారు. మండలంలో ప్రస్తుతం 1400నుంచి 1500వరకు మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారు. ఈ సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది.
>
> – తిరుమలస్వామి, ఎంపీడీఓ, దౌల్తాబాద్

పనితీరు మార్చుకోకపోతే చర్యలు

- అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలి
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

దోమ: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయంలో అధికారులు పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనసూయ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనేలా సంబంధిత అధికారులు చర్య తీసుకోవాలని సూచించారు. బొంపల్లి సర్పంచ్ సురేశ్ మాట్లాడుతూ.. గ్రామానికి అంగన్‌వాడీ పోస్టు విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కమిషనర్ వరకు వెళ్లినా రాజకీయ ఒత్తిడితో పోస్టును భర్తీ చేయలేకపోయారని అసంతృప్తి వ్యక్తం చేశారు.

పాఠశాలలను అభివృద్ధి చేయాలి..

మండలంలో 23 సమీక్షలపై అధికారులు చర్చించాల్సి ఉండగా.. కేవలం కొన్నింటిని మాత్రమే పూర్తి చేసి సభను ముగిస్తున్నారని సభ్యులు ఆరోపించారు. దీంతో ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి ఇరిగేషన్ శాఖపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈఈ సిద్దార్థ మన ఊరు-మనబడి పనుల నిర్వహణ విషయంలో సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఇరిగేషన్ శాఖతో పాటు మనఊరు-మనబడి అప్పగించడతో కమీషన్లకు చేయిచాస్తున్నారని కాంట్రాక్టర్లు, సర్పంచులు ఫిర్యాదు చేస్తున్నారని సంబంధిత అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు అధికారులు సభకు హాజరైనప్పటికీ.. ఫోన్లలో లీనమై సభను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని సభ్యులు ఆరోపించారు. ఇలాంటి అధికారులు గ్రామాలను ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. వెంటనే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని సర్పంచులు, ఎంపీటీసీలు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు పనితీరు మార్చుకోవాలన్నారు. మనఊరు-మనబడి కార్యాక్రమంలో పాఠశాలలను అభివృద్ధి చేయాలని, జూన్ చివరి నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ ఉమేశ్, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, అధికారులు పాల్గొన్నారు.

లీకేజీకి పాలనా వైఫల్యమే కారణం

- విద్యార్థుల జీవితంతో ఆడుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం
- విద్యావ్యవస్థపై పట్టులేని మంత్రి సబితారెడ్డి రాజీనామా చేయాలి
- కాంగ్రెస్, వైఎస్ఆర్‌టీపీ నేతల డిమాండ్



పరిగి: సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ఆర్‌టీపీ నాయకులు

కొడంగల్: విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం మాట్లాడారు. విద్యావ్యవస్థపై పట్టులేని మంత్రి సబితారెడ్డి.. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని, గ్రూప్ 1 నుంచి పదో తరగతి వరకు అన్ని ప్రశ్న పత్రాలు పరీక్ష కంటే ముందే బయటకు వస్తున్నాయని మండిపడ్డారు. ప్రశ్న పత్రాల లీకేజీకి బాధ్యత వహించి మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యమే..

పరిగి: ప్రభుత్వ వైఫల్యంతోనే ప్రశ్నపత్రాలు లీకవుతున్నాయని, అందుకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి రాజీనామా చేయాలని వైఎస్ఆర్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కోళ్ల యాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ మొన్న తాండూర్‌లో పదో తరగతి తెలుగు ప్రశ్నపత్రం, నిన్న వరంగల్‌లో క్వశ్చన్ పేపర్ లీక్ కావడం వెనుక ప్రభుత్వం చేతగాని తనం కనిపిస్తోందని ఆరోపించారు. వరుసగా రెండు పేపర్లు లీక్ కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చేందుతున్నారన్నారు. లీకేజీ కారకులను కఠినంగా శిక్షించే వరకు వైఎస్ఆర్‌టీపీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

లీకేజీల సర్కార్..

కుల్కచర్ల: బీఆర్ఎస్ లీకేజీల ప్రభుత్వంగా మారిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్‌టు అధ్యక్షుడు భరత్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్‌సీ లీకేజీలో దేశ వ్యాప్తంగా తెలంగాణ పరువు పోయినా.. ప్రభుత్వం ఇంకా మొద్దు నిద్రలోనే ఉందని విమర్శించారు. కనీసం పదో తరగతి పరీక్షలు కూడా సరిగా నిర్వహించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉండడం సిగ్గుచేటని మండిపడ్డారు. క్వశ్చన్ పేపర్ల లీకేజీకి బాధ్యత వహిస్తూ మంత్రి సబితారెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు జలీల్, బీసీసెల్ మండల ఉపాధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశానికి కేసీఆర్ సేవలు అవసరం

- పేద, రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి
- ఆత్మీయసమ్మేళనంలో ఎమ్మెల్యే యాదయ్య



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: దేశానికి ముఖ్యమంత్రి కేసీఆర్ సేవలు అవసరమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం నవాబుపేట, మాదిరెడ్డిపల్లి, వట్టిమీనపల్లి, దాతాపూర్, చిట్టిగిద్ద, ఎత్‌రాజ్‌పల్లి, యావాపూర్, ఆర్కతల, పులుమామిడి, తిమ్మారెడ్డిపల్లి, చించల్‌పేట గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు, ఆ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని చర్చించడమే లక్ష్యంగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి పనిని ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఎమ్మెల్యే చెప్పారు.

మధ్యవర్తి లేకుండా..

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలోనే కాదు దేశరాజకీయాల్లో బీఆర్ఎస్ క్రియాశీలక పాత్ర పోషించనుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కేసీఆర్.. పేదలు, రైతుల పక్షపాతి అని, వారి మన్ననలు పొందిన ఏకైక ముఖ్యమంత్రి ఆయనేనని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు మధ్యవర్తి లేకుండా నేరుగా లబ్ధిదారులకు చేరుతున్న తీరు ఎక్కడా కనిపించదని స్పష్టం చేశారు. అందుకు కార్యకర్తల కృషి ఎనలేనిదని చెప్పారు. ముఖ్యమంత్రి చొరవతో చేవెళ్ల నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ పథకాలు 100 శాతం అమలవుతున్నాయని, అందుకే చేవెళ్ల ప్రజలు కేసీఆర్‌కు అండగా ఉంటే.. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ జయమ్మ, వైస్ ఎంపీపీ బందయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, సర్పంచులు విజయలక్ష్మి, యశోద, బల్వంత్ రెడ్డి, విమలమ్మ, శ్రీనివాస్, ఎండీ రఫీ, అజయ్‌కుమార్, నర్సిహ్మారెడ్డి, ఎంపీటీసీ పద్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమిలో చెట్ల నరికివేత



సర్వే నంబర్ 59లో కలప దుంగలు

అటవీశాఖ జిల్లా అధికారికి ఫిర్యాదు

ధారూరు: శ్రీ అనంత పద్మనాభస్వామి దేవాలయానికి చెందిన భూమిలో ఓ వ్యక్తి చెట్లు నరకడంపై మంగళవారం అటవీశాఖ జిల్లా అధికారికి ఆలయ ఫౌండర్ ట్రస్టీ పద్మనాభం, ఈఓ నరేందర్‌లు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని కేరెళ్లి గ్రామ సమీపంలో సర్వే నంబర్ 59లో 4.20 ఎకరాల భూమిలో ఉన్న చెట్లను చింతకింది హన్మంత్ అనే వ్యక్తి నరికివేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫారెస్ట్ అనుమతి లేకుండా చెట్లను నరకడం చట్ట విరుద్ధమని, గతంలో ఇదే విషయమై ధారూరు పోలీసులకు ఫిర్యాదు చేశామని వారు వెల్లడించారు. చెట్లు నరికిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారిని కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. మండల పరిధి కళ్లాపూర్ లొంక హనుమాన్ దేవాలయంలో మంగళవారం ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మాట్లాడారు. ఈ క్షేత్రం ఎంతో మహిమానిత్వం కలిగిందని, ఎందరో మహానుభావులు తపస్సుచేసిన స్థలం లొంక ఆంజనేయ స్వామి దేవాలయం అని గుడి స్థలపురాణాన్ని వివరించారు. ప్రతి ఒక్కరు భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని, భక్తి మార్గంతోనే ముక్తి లభిస్తుందన్నారు. ఎంపీపీ అరవింద్‌రావు, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు పాల్గొన్నారు.

టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి

అనంతగిరి: వికారాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నామని పలువురు పాఠకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం వారు గ్రంథాలయం ఎదుట నిరసన తెలిపారు. నిత్యం అనేక మంది పాఠకులు వస్తుంటారని, గంటల తరబడి ఇక్కడ సమయం వెచ్చిస్తుండడంతో మూత్రశాలలు లేక ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. ఈ విషయంలో పాలకులు, అధికారులు వెంటనే స్పందించి టాయిలెట్స్ నిర్మించాలని డిమాండ్ చేశారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

ఎంపీపీ వెంకట్



సర్పంచ్ నర్సింహ్మారెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ వసంత తదితరులు

మోమిన్‌పేట: బాధ్యతలు గుర్తించి, అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు వస్తుందని ఎంపీపీ వసంత అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ అవార్డు అందుకున్న చీమల్‌దరి సర్పంచ్ నర్సింహ్మారెడ్డి, కార్యదర్శి సుగుణను శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఒక్క రోజుతో ఈ అవార్డు రాలేదని, సర్పంచ్‌గా గెలుపొందిన నాటి నుంచి ఆయన చేసిన సేవలకు దక్కిన గౌరవమే ఈ అవార్డు అని సంతోషం వ్యక్తంచేశారు. అధికారులు, గ్రామస్తుల సహకారం కూడా ఎంతో ఉందన్నారు. ఇదిలా ఉండగా.. సర్పంచ్, కార్యదర్శిని గ్రామంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శైలజారెడ్డి, ఎంపీఓ యాదగిరి, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మానస, ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హరిశంకర్, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే 'కంటివెలుగు' లక్ష్యం



కంటివెలుగు శిబిరంలో మాట్లాడుతున్న మనోహర్ రెడ్డి

డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి

కుల్కచర్ల: అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటివెలుగు కార్యక్రమం గ్రామీణ ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తుందని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం తిర్మలాపూర్ గ్రామంలో రెండో విడత కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కంటి చూపును పరిరక్షించాలనే సంకల్పంతో కంటివెలుగు ప్రారంభించడం జరిగిందని, గ్రామస్తులందరూ నేత్ర వైద్య శిబిరాన్ని వినియోగించుకొని.. తమ కంటి సమస్యను పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటమ్మ, ఎంపీటీసీ రాంలాల్, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు మొగులయ్య, యాదయ్య, స్థానిక నేతలు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'పది' పరీక్షలు

కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అధికారులు



ధారూరు: కేరెళ్ల పరీక్షా కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

పెద్దేముల్: పదో తరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం పోలీస్, రెవెన్యూ, విద్యా శాఖ అధికారులు కట్టుదిట్టం చేశారు. ఉదయం 9గంటలకు సెంటర్లలోకి ఇన్విజిలేటర్లను మినహా మరెవరినీ అనుమతించలేదు. సెల్‌ఫోన్లను నిరాకరించారు. పోలీసులు కూడా తమ ఫోన్లను ఠాణలో పెట్టి విధులు నిర్వహించారు. తాండూరు రూరల్ సీఐ రాంబాబు, పెద్దేముల్ ఇన్‌చార్జి తహసీల్దార్ మహేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. రెండో రోజున 610 మందికి 607 విద్యార్థులు పరీక్ష రాశారని, మరో ముగ్గురు ఆబ్సెంట్ అయ్యారని ఎంఈఓ వెంకటయ్య తెలిపారు.

సెల్‌ఫోన్లన్నీ బయటే..

ధారూరు: ధారూరు, కేరెళ్లి పరీక్ష కేంద్రాల వద్ద సీఐ అప్పయ్య, ఎస్ఐ సంతోష్‌కుమార్‌ల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్రం వద్ద ఉన్న సీఎస్, డీఓలతో పాటు ఇన్విజిలేటర్ల నుంచి సిబ్బంది వరకు వారి సెల్‌ఫోన్లను బయటే భద్రపర్చారు. ఈ పరీక్ష కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ప్రశాంతంగా..

దౌల్తాబాద్: తెలుగు ప్రశ్నపత్రం లీకేజీ నేపథ్యంలో అధికారులు రెండో రోజు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ తిరుమలస్వామి, ఎస్ఐ రమేష్‌కుమార్ తదితర అధికారులు పరీక్ష పూర్తయ్యే వరకు ఎగ్జామ్ సెంటర్ల వద్దే ఉండి సమీక్షించారు.

ఐదుగురు గైర్హాజరు

యాలాల: బాలుర ఉన్నత, అగ్గనూరు, ప్రతిభ, గౌతమి పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేందాల్లో 738 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 733 మంది మాత్రమే హాజరయ్యారు. ఐదుగురు విద్యార్థులు రాలేదు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎ కేంద్రంలో 190మంది, బి కేంద్రంలో 236 మంది వి ద్యార్థులు రెండు కేంద్రాల్లో 426మంది హిందీ పరీక్ష రాశారు. ఎ కేంద్రానికి సూపరింటెండెంట్‌గా మోహన్, డిపార్ట్‌మెంటల్ అధికారిగా వెంకటయ్య, బి కేంద్రానికి సూపరింటెండెంట్‌గా సుధాకర్, డిపార్ట్‌మెంటల్ అధికారిగా ఎం. వెంకటేశం వ్యవహరించారు.



పెద్దేముల్: పరీక్ష కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న సీఐ, తహసీల్దార్

కర్షకులు కిసాన్ క్రెడిట్ కార్డు పొందాలి

లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు

మోమిన్‌పేట: ప్రతి రైతు కిసాన్ క్రెడిట్ కార్డు పొందాలని లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు చెప్పారు. మంగళవారం మండల కేంద్రం రైతు వేదికలో మత్స్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిసాన్ క్రెడిట్ కార్డు పొందిన రైతు.. పంట రుణం తీసుకుంటే కేవలం రూ.0.34పైసల వడ్డీ మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. రుణ పరిమితి రూ.లక్ష ఉంటే అదనంగా.. రూ.60వేలు రుణం పొందే అవకాశం ఉందన్నారు. పంట రుణాలు సక్రమంగా చెల్లించిన ప్రతి రైతు అర్హుడేనని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి అనిల్‌కుమార్, ఎఫ్‌డీఓ సౌజన్య, మండల పశు వైద్యాధికారి గీత, యూనియన్ బ్యాంకు మేనేజర్, ఎస్‌బీఐ ఫీల్డ్ అధికారి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని మాజీ వైస్‌ఎంపీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం యాంకి, దేశాయిపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీ, రూ.500లకే సిలిండర్, పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. నాయకులు సత్యపాల్, మాధవరెడ్డి, రెడ్యానాయక్, రాజు, మహిపాల్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు